RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్ ఆఫ్ ప్రజలు

ప్రజల గొంతుక - నిజం కోసం..

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

హైదరాబాద్ | శుక్రవారం, ఆగస్టు 28, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 120 | పేజీలు: 8 | వెల : రూ.1





### ఓటర్ల జాబితా సవరణ

ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

# మీరాలం చెరువుకు మహర్దశ

పర్యాటక, వినోద కేంద్రంగా సమగ్ర అభివృద్ధి


కుటుంబాలతో రోజంతా గడిపేలా సరికొత్త రూపు

ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణం

బోటింగ్, జల క్రీడలకు అవకాశాల పరిశీలన

ఐలాండ్లలో ప్రకృతి ఆధారిత పర్యాటక సదుపాయాలు

జూతో అనుసంధానించి ప్రత్యేక పర్యాటక అనుభవం



హైదరాబాద్: చారిత్రక ప్రాధాన్యం కలిగిన మీరాలం చెరువుకు కొత్త రూపు రానుంది. కుటుంబ సమేతంగా వచ్చి ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ రోజంతా గడిపేలా ఈ ప్రాంతాన్ని పర్యాటక, వినోద కేంద్రంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం మీరాలం చెరువును ఆకస్మికంగా సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించి, నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. చెరువు చుట్టూ చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు నిర్మాణంలో ఉన్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జిని కూడా పరిశీలించారు. మీరాలం చెరువు పునరుజ్జీవం, పరిసర ప్రాంతాల అభివృద్ధి, చెరువులోని ఐలాండ్ల అభివృద్ధి, ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణం వంటి అంశాలను


(మిగతా 2వ పేజీలో)

# సింగరేణిలో తగ్గుతున్న కార్మికుల సంఖ్య

**కొత్త నియామకాలు లేక, గనుల మూతతో ప్రశ్నార్థకంగా మారుతున్న ఏరియాల భవిష్యత్**



భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్టు 27 : ఒకప్పుడు బొగ్గు గనులు, వేలాది మంది కార్మిక కుటుంబాలతో కళకళలాడిన సింగరేణి ప్రాంతాలు నేడు కార్మికుల కొరతతో వెలవెలబోతున్నాయి. ఓ వైపు బొగ్గు గనులు క్రమంగా మూతపడుతుండగా.. మరోవైపు సింగరేణి యాజమాన్యం కొత్త నియామకాలు చేపట్టకపోవడంతో కార్మికవాడలు బోసిపోతున్నాయి. గనుల మూతతో ఇంతకాలం పనిచేసిన కార్మికులు ఇతర ప్రాంతాలకు తరలిపోతుండటంతో పలు ఏరియాల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒకప్పుడు సింగరేణిలో ఉద్యోగం అంటేనే భయపడే పరిస్థితి ఉండేది. బొగ్గు గనుల్లో పనిచేయడానికి చాలామంది వెనుకంజ వేసేవారు. అయితే కాలక్రమంలో సింగరేణి సంస్థ వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించే సంస్థగా రూపాంతరం చెందింది. బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు అప్పటి డైరెక్టర్ జీపీ రావు నేతృత్వంలో పెద్ద ఎత్తున నియామకాలు చేపట్టారు. ఆ సమయంలో కార్మికుల ఎంపికలో పరుగు పందెం వంటి పోటీలు నిర్వహించడంతోపాటు, అంతకుముందు బరువులు ఎత్తే సామర్థ్యం ఆధారంగా కూడా ఉద్యోగాలు కల్పించేవారు. 1985 ప్రాంతంలో రన్నింగ్ ద్వారా ఒకేసారి సుమారు 40 వేల మందిని నియమించిన సందర్భం ఉంది. దీంతో సింగరేణిలో కార్మికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే కాలక్రమంలో బొగ్గు ఉత్పత్తి పెరిగినప్పటికీ కార్మికుల సంఖ్య మాత్రం క్రమంగా తగ్గుతూ వచ్చింది. సంస్థలో అవసరానికి మించి కార్మికులు ఉన్నారనే కారణంతో యాజమాన్యం వివిధ పద్ధతుల్లో ఉద్యోగుల సంఖ్యను తగ్గించే చర్యలు చేపట్టింది. గోల్డెన్ షేక్‌హ్యాండ్ పథకం ద్వారా సర్వీసు పూర్తికాకముందే పలువురు కార్మికులు ఉద్యోగాల నుంచి వైదొలిగే పరిస్థితి ఏర్పడింది. దీంతో సింగరేణి వ్యాప్తంగా కార్మికుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఒకప్పుడు లక్షకు పైగా కార్మికులు పనిచేసిన సింగరేణి సంస్థలో ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 40 వేలకు చేరుకుంది. అన్ని ఏరియాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గత ఐదేళ్లలో కార్మికుల సంఖ్య ఎన్నడూ లేనంత వేగంగా తగ్గినప్పటికీ కొత్త నియామకాలపై యాజమాన్యం పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త నియామకాలు లేకపోవడం, సీనియర్ కార్మికులు పదవీ విరమణ చేయడం, కొన్ని గనులు మూతపడటం వంటి పరిణామాలతో కార్మికుల సంఖ్య మరింత తగ్గుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో సింగరేణి ప్రాంతాల్లోని అనేక కార్మికవాడలు పూర్తిగా వెలవెలబోయే ప్రమాదం ఉందని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ ప్రాంత పరిధిలోని సింగరేణి శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి ఏరియాల్లోనూ కార్మికుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఐదేళ్ల క్రితం ఈ మూడు ఏరియాల్లో కలిపి సుమారు 21 వేల మంది వరకు కార్మికులు ఉండగా.. ప్రస్తుతం 14 వేల మందికి పైగా మాత్రమే విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. రాబోయే ఐదేళ్లలో మరిన్ని గనులు మూతపడితే కార్మికుల సంఖ్య మరింత తగ్గిపోయే అవకాశం ఉంది. కొత్త నియామకాలు చేపట్టకపోతే అనుభవజ్ఞులైన కార్మికుల స్థానంలో కొత్త తరం సిబ్బంది లేకపోవడం సంస్థ భవిష్యత్ నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గనులు నడిచిన కాలంలో కార్మిక కుటుంబాలతో కళకళలాడిన సింగరేణి కాలనీల్లో ప్రస్తుతం జనసంచారం తగ్గుతోంది. గనులు మూతపడటం, ఉద్యోగులు ఇతర ప్రాంతాలకు తరలిపోవడం, కొత్త నియామకాలు లేకపోవడంతో పాఠశాలలు, మార్కెట్లు, చిన్న వ్యాపారాలు, ఇతర వాణిజ్య కార్యకలాపాలపైనా ప్రభావం పడుతోంది. సింగరేణి సంస్థకు కొత్త గనులు, కొత్త ఉపాధి అవకాశాలు, అవసరమైన చోట కొత్త నియామకాలు చేపట్టడంతోపాటు మూతపడుతున్న గనుల ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను కల్పించాల్సిన అవసరం ఉందని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు. లేకపోతే ఒకప్పుడు కార్మికుల కష్టంతో వెలుగొందిన సింగరేణి ప్రాంతాలు భవిష్యత్తులో క్రమంగా జనరహిత ప్రాంతాలుగా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది




### ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేదే అధికారం..

## కానీ తగ్గిన సీట్లు: మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే

ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేకు 326 సీట్లు వస్తాయని అంచనా

జనవరి సర్వేతో పోలిస్తే ఎన్డీయే కూటమికి 26 సీట్లు తగ్గుదల

ప్రధాని అభ్యర్థిగా నరేంద్ర మోదీకి 49 శాతం మంది మద్దతు

ఇండియా కూటమికి 185 స్థానాలు దక్కుతాయని వెల్లడి



## సోదరుడు కేటీఆర్‌పై కవిత తీవ్ర అసంతృప్తి

రాఖీ పండుగకు కూడా అందుబాటులో ఉండకపోవడంపై ఆవేదన

ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని భావోద్వేగ వ్యాఖ్య

బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం వల్లే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శ

హరీశ్ రావు బీజేపీ మద్దతుతో పార్టీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపణ

### నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన

# 29మంది గల్లంతు

నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలుగు రాష్ట్రాల యాత్రికులు

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మంది గల్లంతు

యాత్రికుల భద్రతపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి సమీక్షలు

బాధితుల సహాయం కోసం ఢిల్లీలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

కేంద్ర ప్రభుత్వం, రాయబార కార్యాలయాలతో సమన్వయం



నేపాల్‌ను ముంచెత్తిన ఆకస్మిక వరదలు కైలాస మానస సరోవర యాత్రకు వెళ్లిన తెలుగు రాష్ట్రాల యాత్రికులను తీవ్ర కష్టాల్లోకి నెట్టాయి. ఈ విపత్తు కారణంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు, తెలంగాణకు చెందిన 22 మందితో సహా మొత్తం 29 మంది ఆచూకీ ఇంకా లభించలేదని అధికారులు గురువారం తెలిపారు. వీరిని సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏడుగురు యాత్రికుల ఆచూకీ తెలియరాలేదని, మరో 34 మంది సురక్షితంగా ఉన్నారని అధికారులు వెల్లడించారు. కర్నూలు-ఆదోనికి చెందిన నలుగురు టిబెట్‌లో క్షేమంగా ఉండగా, తిరుపతి ప్రాంతానికి చెందిన 28 మంది యాత్రికులు ఖాట్మండులో సురక్షితంగా ఉన్నట్లు రియల్-టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ద్వారా సంప్రదించి నిర్ధారించుకున్నారు. గల్లంతైన ఏడుగురిలో చిత్తూరు, విజయవాడ, కాకినాడ, గుంటూరుకు చెందిన వారున్నారు. వీరిలో ముగ్గురు ఈశా ఫౌండేషన్ నిర్వహించిన యాత్రలో పాల్గొన్నారని, వారి ఫోన్లు స్విచ్ ఆఫ్

(మిగతా 2వ పేజీలో)



# పాలిటెక్నిక్ విద్యార్థులపై ఎందుకీ ఉక్కుపాదం?

విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా?.. హరీశ్‌రావు ఆగ్రహం

ఆందోళన చేస్తున్న వారి గొంతు నొక్కుతారా? అని ప్రశ్న

జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్

ఏపీ, ఢిల్లీ తరహాలో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచన

విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడమే తప్పా? అంటూ నిలదీత

హనుమకొండ కలెక్టరేట్ వద్ద ధర్నా.. అరెస్టు

వరంగల్: పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులకు మద్దతుగా వెళ్లిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావును పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చర్యపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "విద్యార్థులు ఏమైనా ఉగ్రవాదులా? తమ సమస్యలపై ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతు నొక్కుతారా?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీవో 97ను వెంటనే రద్దు చేసి,

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు
శుక్రవారం, ఆగస్టు 28, 2026

# మీరాలం చెరువుకు మహర్దశ

సమగ్రంగా పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదల సమయంలో చెరువు నుంచి మూసీ నదిలోకి నీరు సాఫీగా వెళ్లేలా నాలాలను విస్తరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని చెప్పారు. చెరువు పునరుజ్జీవంతో పాటు నీటి నాణ్యతను గణనీయంగా మెరుగుపరచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. మీరాలం చెరువును జల వినోదాలకు అనువైన ప్రాంతంగా తీర్చిదిద్దే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. సాంకేతిక, పర్యావరణ, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా బోటింగ్, జల క్రీడలు, సాహస క్రీడలకు అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. చెరువు చుట్టూ ఆహార కేంద్రాలు, పచ్చని ఉద్యానవనాలు, విశ్రాంతి ప్రదేశాలు, కుటుంబ వినోద సదుపాయాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలాలు, వినోద కార్యకలాపాల కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాదచారులకు అనుకూలంగా నడక మార్గాలు, విశాలమైన ప్రజా ప్రదేశాలను అభివృద్ధి చేయడంతో పాటు సందర్శకుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా రవాణా సదుపాయాలను మెరుగుపరచాలని సీఎం తెలిపారు. చెరువులోని ఐలాండ్లను కూడా ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ప్రకృతి ఆధారిత విశ్రాంతి కేంద్రాలు, గ్లాంపింగ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు. వివాహాలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించుకునేలా ప్రత్యేక వేదికలను అభివృద్ధి చేసి మీరాలంను ప్రముఖ కార్యక్రమాల గమ్యస్థానంగా తీర్చిదిద్దే అంశంపై దృష్టి పెట్టాలని చెప్పారు. నాణ్యమైన పర్యాటక, వినోద సదుపాయాల కల్పనలో ప్రభుత్వంతో పాటు ప్రైవేటు రంగ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య విధానంలో వివిధ ప్రాజెక్టులను చేపట్టి స్థానికంగా ఉపాధి అవకాశాలను పెంచేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. మీరాలం చెరువుకు సమీపంలోని నెహ్రూ జూలాజికల్ పార్కుతో అనుసంధానం కల్పించడంపై కూడా సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. జూ సందర్శనతో పాటు మీరాలం చెరువు ప్రకృతి అందాలు, పర్యాటక సదుపాయాలు, కుటుంబ వినోదాన్ని కలిపి ఒకే సమగ్ర పర్యాటక అనుభవంగా అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. చెరువు పునరుజ్జీవం, పరిసర ప్రాంతాలు, ఐలాండ్ల అభివృద్ధికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రస్తుతం రూపుదిద్దుకుంటోందని అధికారులు సీఎంకు వివరించారు.



# ముంచెత్తిన మృత్యు ప్రవాహం

కాఠ్మాండూ: నేపాల్‌లో వరద, బురద సృష్టించిన విధ్వంసం అంతకంతకూ వెలుగులోకి వస్తోంది. ఎక్కడ చూసినా మృత్యువు ఛాయలే కనిపిస్తున్నాయి. గురువారం వెలుగులోకి వచ్చిన దృశ్యాలు విపత్తు తీవ్రతను కళ్లకు కట్టాయి. రసువా జిల్లాలో కొండచరియలు, మంచు, రాళ్లు, శిథిలాలు లిండే నదీ ప్రవాహానికి అడ్డుగా నిలవడంతో అక్కడ తాత్కాలికంగా భారీ నీటి నిల్వ ఏర్పడింది. ఆ అడ్డంకి ఒక్కసారిగా తొలగిపోవడంతో వరద, బురద ఉద్ధృతంగా దిగువ ప్రాంతాలపైకి దూసుకొచ్చింది. భోటే కోశీ, త్రిశూలి నదుల్లో ప్రవాహం ఒక్కసారిగా పెరిగి పలు జిల్లాలను ముంచెత్తింది. భారీ ప్రవాహానికి భవనాలు పేకమేడల్లా కూలిపోయాయి. వాహనాలు కొట్టుకుపోయాయి. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీసిన ప్రజలను సైతం వరద ప్రవాహం చుట్టుముట్టింది. జంతువులు, చెట్లు సైతం వరదలో కొట్టుకుపోయాయి. ఈ విపత్తు ప్రభావం టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. భారీగా వరద నీరు, బురద పోటెత్తడంతో పలు భవనాలు నేలమట్టమయ్యాయి. నేపాల్, టిబెట్ ప్రాంతాల్లో కలిపి మృతుల సంఖ్య గురువారానికి 392కు చేరింది. గల్లంతైన వారి సంఖ్య 1,468గా అధికారులు వెల్లడించారు. నేపాల్‌లోనే ఇప్పటివరకు 389 మృతదేహాలు లభ్యమయ్యాయి. టిబెట్‌లో మరో ముగ్గురు మృతి చెందారు. నేపాల్‌లో గల్లంతైన వారిలో 288 మంది భారతీయులు ఉన్నట్లు భారత విదేశీ వ్యవహారాలశాఖ వెల్లడించింది. వారిలో కొందరు తెలుగువారు కూడా ఉన్నట్లు తెలిసింది. మరో 200 మంది భారతీయులు టిబెట్ ప్రాంతంలో చిక్కుకున్నట్లు పేర్కొంది. మానసరోవర్ యాత్రకు వెళ్లిన పలువురి ఆచూకీ కూడా లభించలేదు. తమిళనాడుకు చెందిన 37 మంది ఒక పర్యాటక సంస్థ ద్వారా, మరో 49 మంది మరో సంస్థ ద్వారా యాత్రకు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. కర్ణాటకకు చెందిన 13 మంది కూడా గల్లంతైన వారిలో ఉన్నారు. నేపాల్ పర్యాటకశాఖ ప్రకారం 590 మంది పర్యాటకుల జాడ తెలియడం లేదు. వీరిలో 476 మంది విదేశీయులు కాగా, 114 మంది నేపాలీలు ఉన్నారు. గల్లంతైన పర్యాటకులు 30 దేశాలకు చెందినవారని అధికారులు తెలిపారు. వేలాది కుటుంబాలు ఇళ్లను కోల్పోయాయని, అనేక మంది గల్లంతయ్యారని నేపాల్ అధికారులు వెల్లడించారు. జల విద్యుత్తు ప్రాజెక్టులు, కస్టమ్స్ కార్యాలయాల్లో పనిచేస్తున్న సుమారు 160 మంది ఉద్యోగుల ఆచూకీ కూడా తెలియడం లేదని పేర్కొన్నారు. విపత్తు కారణంగా మధ్య నేపాల్‌లో మౌలిక వసతులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 35 వంతెనలు, 45 సస్పెన్షన్ వంతెనలు, దాదాపు 40 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయి. కాఠ్మాండూను ఇతర ప్రాంతాలతో కలిపే ప్రధాన రహదారి కూడా తీవ్రంగా దెబ్బతింది. చితవాన్ జిల్లాలో అత్యధికంగా 132 మృతదేహాలు లభ్యమయ్యాయి. తూర్పు నవాల్‌పరసీలో 62, ధాడింగ్‌లో 27, గూర్ఖాలో 20, రసువాలో 17, పశ్చిమ నవాల్‌పరసీలో 15, నువాకోట్‌లో 12 మృతదేహాలను సహాయక



బృందాలు వెలికితీశాయి. ఇప్పటివరకు 84 మంది భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు భారత విదేశీ వ్యవహారాలశాఖ తెలిపింది. వీరిలో త్రిశూల్ విద్యుత్తు ప్రాజెక్టు వద్ద పనిచేస్తున్న 63 మంది ఉద్యోగులు ఉన్నారు. సహాయక సిబ్బంది 27 మంది విదేశీ పర్యాటకులను రక్షించగా, వారిలో 11 మంది భారతీయులు ఉన్నారు. తమవారి ఆచూకీ కోసం కాఠ్మాండూలోని త్రిభువన్ ఆసుపత్రి వద్ద వందలాది మంది బంధువులు, కుటుంబసభ్యులు గుమిగూడారు. భారీ విపత్తు నేపథ్యంలో భారత్ సహాయక చర్యలను ముమ్మరం చేసింది. బుధవారం నుంచి నేపాల్‌కు 47.5 టన్నుల అత్యవసర సామగ్రిని పంపించింది. పరిస్థితిపై విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ సమీక్ష నిర్వహించారు. సహాయక, గాలింపు చర్యలు నిరంతరం కొనసాగుతున్నాయి. ఇప్పటికే వరదలతో అల్లాడుతున్న నేపాల్‌కు మరో ముప్పు పొంచి ఉందని చైనా హెచ్చరించింది. భోటే కోశీ నదికి దిగువన రసువా జిల్లాలో ఆనకట్టను తలపించే భారీ మట్టి, రాళ్ల నిర్మాణం ఏర్పడిందని, దాని వెనుక పెద్దఎత్తున నీరు చేరుతోందని తెలిపింది. ఈ తాత్కాలిక అడ్డంకి రానున్న మూడు రోజుల్లో ఎప్పుడైనా బద్దలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. నేపాల్–టిబెట్ సరిహద్దులో రెండు నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఈ ప్రాంతం ఉంది. దీంతో భోటే కోశీ, త్రిశూలి నదీ తీరాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నేపాల్ ప్రభుత్వం సూచించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు సురక్షిత ప్రాంతాలను వీడొద్దని హెచ్చరించింది.

## ఓటర్ల జాబితా సవరణ ఫేక్ డాక్యుమెంట్లపై ఎన్నికల సంఘం గట్టి హెచ్చరిక

తెలంగాణలో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎవరైనా తప్పుడు పత్రాలు సమర్పిస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) హెచ్చరించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారాన్ని, నకిలీ పత్రాలను సమర్పించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఓటర్లు సమర్పించే పత్రాలను, డిక్లరేషన్లను అధికారులు స్వతంత్రంగా ధ్రువీకరిస్తారని సీఈఓ కార్యాలయం వెల్లడించింది. ప్రభుత్వ అధికారికి తప్పుడు సమాచారం అందించడం భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 217 ప్రకారం శిక్షార్హమని పేర్కొన్నారు. అదేవిధంగా, ఓటర్ల జాబితా సవరణలో తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం–1950లోని సెక్షన్ 31 ప్రకారం జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే 2 లక్షల మందికి పైగా ఓటర్లకు నోటీసులు జారీ చేశారు. మొత్తం మీద 92.8 లక్షల మంది ఓటర్లకు నోటీసులు అందజేయనున్నారు. వీరిలో 60.5 లక్షల మంది ఓటర్ల డేటాలో వ్యత్యాసాలు ఉండగా, మరో 32.3 లక్షల మంది వివరాలు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని అధికారులు గుర్తించారు. విచారణ సమయంలో ఓటర్లు గానీ, వారి కుటుంబ సభ్యులు గానీ తప్పనిసరిగా వ్యక్తిగతంగా హాజరు కావాలని అధికారులు సూచించారు. ఓటర్లు తమ వివరాల స్థితిని ఆన్‌లైన్‌లో మొబైల్ నంబర్‌తో లాగిన్ అయి, ఎపిక్ నంబర్ నమోదు చేసి, ఓటీపీ ద్వారా స్వయంగా ధ్రువీకరించుకోవచ్చని వెల్లడించారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులపై ఎందుకీ ఉక్కుపాదం?

పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండలోని సుబేదారి పోలీస్‌స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. తమ భవిష్యత్తును కాపాడాలని విద్యార్థులు ఆందోళన చేస్తుంటే వారిపై కేసులు పెట్టడం, భౌతిక దాడులకు పాల్పడటం సరికాదన్నారు. వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి విద్యార్థుల సమస్యలను తెలుసుకోవడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ప్రస్తుతం పాలిటెక్నిక్ విద్యార్థులు మూడేళ్లకు రూ.15 వేలలోపే ఫీజుతో చదువుతున్నారని, భవిష్యత్తులో ఫీజులు పెరిగితే పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఏపీలో పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. ఢిల్లీలోనూ ఇలాంటి విధానం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పేర్కొన్నారు. అక్కడ విఫలమైన విధానాన్ని తెలంగాణలో ఎందుకు అమలు చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. ఏపీ, ఢిల్లీ తరహాలో జీవో 97ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నేతలను అరెస్టులు, కేసులతో అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. జీవో 97ను రద్దు చేయకపోతే విద్యార్థులు, యువత మరింత పెద్ద ఎత్తున ఉద్యమించే పరిస్థితి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు తమ సమస్యలపై ఆందోళనలు చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి వారి సమస్యలపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. “ఢిల్లీకో నీతి.. తెలంగాణకో నీతా?” అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇదే సమయంలో హనుమకొండ కలెక్టరేట్ వద్ద టీఎన్జీఓలు చేపట్టిన ధర్నాకు హరీశ్‌రావు మద్దతు తెలిపారు. ధర్నా శిబిరానికి చేరుకుని ఉద్యోగులకు సంఘీభావం ప్రకటించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు బీఆర్ఎస్ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు దగ్గరపడుతున్నా కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు కాలేదని, వేతన సవరణ సంఘం అంశంలోనూ పురోగతి లేదని విమర్శించారు. దేశంలో ఆరు విడతల కరువు భత్యాలు పెండింగ్‌లో పెట్టిన ఘనత రేవంత్‌రెడ్డి ప్రభుత్వానిదేనని హరీశ్‌రావు ఆరోపించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ‘రేవంత్‌రెడ్డి.. మీరు ప్రభుత్వం నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా?” అని ప్రశ్నించారు. ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును కూడా కాలరాస్తున్నారని, ఇలాంటి చర్యలకు ఏదో ఒక రోజు ప్రజల నుంచి తగిన సమాధానం ఎదురవుతుందని హెచ్చరించారు. హరీశ్‌రావు పర్యటన ముందుగానే పోలీసులకు సమాచారం అందడంతో ఆయనను మార్గమధ్యంలోనే అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు, విద్యార్థి నాయకులను పలుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీఎన్జీఓల ధర్నాలో పాల్గొన్న హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులను కలెక్టరేట్ వద్ద అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాయకుల అరెస్టుతో పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని బైఠాయించి ఆందోళన చేపట్టారు.

## నేపాల్ వరదలు.. ఏపీ, తెలంగాణకు చెందిన 29మంది గల్లంతు

వస్తున్నాయని తెలిపారు. ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న వారిని సురక్షితంగా తీసుకురావడమే ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. బాధితుల వివరాలు ఎప్పటికప్పుడు తెలుసుకుని, వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం, ఖాట్మండు, చైనాలలోని భారత రాయబార కార్యాలయాలతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. రోడ్డు, వాయు మార్గాల పునరుద్ధరణతో పాటు, అవసరమైతే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా యాత్రికులను తరలించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సహాయక చర్యల కోసం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. తెలంగాణకు చెందిన 22 మంది యాత్రికుల ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. మొదట 23 మంది గల్లంతైనట్లు భావించినా, రంగారెడ్డి జిల్లాకు చెందిన ఒక యాత్రికుడు తన కుటుంబంతో మాట్లాడటంతో అతను సురక్షితంగా ఉన్నట్లు తేలింది. గల్లంతైన వారిలో ఆరుగురు తెలంగాణకు చెందినవారు కాగా, 17 మంది తెలంగాణ మూలాలున్న ఎన్నారైలు. వీరిలో చాలామంది నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా, రసువాగఢి, గైరాంగ్ వంటి ప్రాంతాల్లో ఉన్నట్లు చివరిసారిగా తెలిసిందని అధికారులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఢిల్లీలోని తెలంగాణ భవన్, హైదరాబాద్‌లోని సచివాలయంలో హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు దాదాపు 80–100 కాల్స్ వచ్చినట్లు తెలిపారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ స్వయంగా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. కేంద్ర విదేశాంగ శాఖ, భారత రాయబార కార్యాలయాలతో సమన్వయం చేసుకుంటూ గల్లంతైన వారిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధితుల కుటుంబాలు, ట్రావెల్ ఆపరేటర్ల నుంచి వచ్చిన సమాచారాన్ని ధ్రువీకరించుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది.

## ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయేదే అధికారం.. కానీ తగ్గిన సీట్లు: మూడ్ ఆఫ్ ది నేషన్ సర్వే


దేశంలో ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికలు నిర్వహిస్తే, అధికార ఎన్డీయే కూటమి మరోసారి స్పష్టమైన మెజారిటీతో విజయం సాధిస్తుందని ‘ఇండియా టుడే–సి ఓటర్’ నిర్వహించిన ‘మూడ్ ఆఫ్ ది నేషన్’ సర్వే వెల్లడించింది. అయితే, గత సర్వేతో పోలిస్తే ఎన్డీయే బలం స్వల్పంగా తగ్గగా, ‘ఇండియా’ కూటమి కొంత పుంజుకున్నట్లు ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. ఈ సర్వే ప్రకారం, ఇప్పుడు ఎన్నికలు జరిగితే ఎన్డీయే కూటమి 45 శాతం ఓట్ షేర్‌తో 326 స్థానాలను కైవసం చేసుకుంటుంది. ఇందులో బీజేపీ సొంతంగా 261 సీట్లు సాధిస్తుందని, మిత్రపక్షాలు 65 సీట్లు గెలుచుకుంటాయని అంచనా. ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన సర్వేలో ఎన్డీయేకు 352 సీట్లు వస్తాయని అంచనా వేయగా, తాజా సర్వేలో ఆ సంఖ్య 26 మేర తగ్గడం గమనార్హం. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని ‘ఇండియా’ కూటమి 185 సీట్లు సాధిస్తుందని సర్వే పేర్కొంది. జనవరి సర్వేతో పోలిస్తే ఇది 3 సీట్లు ఎక్కువ. అయితే, 2024 సాధారణ ఎన్నికల్లో గెలుచుకున్న 234 స్థానాలతో పోలిస్తే ఇది 49 సీట్లు తక్కువ. ఓట్ షేర్ పరంగా ఎన్డీయేకు 45.1 శాతం, ‘ఇండియా’ కూటమికి 39.1 శాతం ఓట్లు వచ్చే అవకాశం ఉంది. తదుపరి ప్రధానిగా ఎవరు ఉండాలనే ప్రశ్నకు 49 శాతం మంది నరేంద్ర మోదీకి మద్దతు పలికారు. రాహుల్ గాంధీకి 27 శాతం మంది మొగ్గు చూపారు. ఇక అనూహ్యంగా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ పార్టీ 9 శాతం మద్దతుతో మూడో స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఆ పార్టీకి పార్లమెంటులో ఒక్క ఎంపీ కూడా లేకపోవడం గమనార్హం. రాహుల్ గాంధీ చేపట్టిన ప్రజా ఉద్యమాల ప్రభావంతో కాంగ్రెస్ సీట్ల సంఖ్య 80 నుంచి 106కు పెరిగిందని సర్వే విశ్లేషించింది. అదే సమయంలో పరీక్షల పేపర్ లీకులు, ఇతర పరిపాలనాపరమైన అవకతవకల కారణంగా బీజేపీ గెలిచే సీట్ల సంఖ్య గత ఆరు నెలల్లో 287 నుంచి 261కి తగ్గినట్లు సర్వే పేర్కొంది. ఈ సర్వేను జులై 1 నుంచి ఆగస్టు 25 మధ్య కాలంలో మొత్తం 25,184 మంది అభిప్రాయాల ఆధారంగా నిర్వహించారు.

## సోదరుడు కేటీఆర్‌పై మాజీ ఎంపీ కవిత తీవ్ర అసంతృప్తి

బీఆర్ఎస్‌లో అంతర్గత సంక్షోభం వల్లే ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదని విమర్శ
హరీశ్ రావు బీజేపీ మద్దతుతో పార్టీని చేజిక్కించుకోవాలని చూస్తున్నారని ఆరోపణ

రేపు రాఖీ పండుగ నేపథ్యంలో తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత తన సోదరుడు, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సోదరుడికి రాఖీ కట్టే అవకాశం మరోసారి దక్కకపోవడంపై ఆమె తీవ్ర ఆవేదన, అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆడబిడ్డగా తన ఆత్మగౌరవం దెబ్బతిన్నదని వ్యాఖ్యానించడం చర్చనీయాంశంగా మారింది. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, రాఖీ పండుగ ప్రస్తావన రాగా కవిత భావోద్వేగానికి గురయ్యారు. “ఈసారి కేటీఆర్‌కు రాఖీ కడతారా?” అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఆమె స్పందిస్తూ, “పోయినసారి అడిగితే ఆయన ఊర్లో లేకుండా పారిపోయారు. ఈసారి అడగకుండానే ఏకంగా విదేశాలకు వెళ్లిపోయారు. ఆడబిడ్డలమైన మాకు కూడా ఆత్మగౌరవం ఉంటుంది కదా? మా ఆత్మగౌరవం చాలా తీవ్రంగా దెబ్బతింది” అని ఆవేదనతో అన్నారు. రాఖీ అంటే రక్త సంబంధమని, దాన్ని రాజకీయాలతో ముడిపెట్టకూడదని ఆమె హితవు పలికారు. రాఖీ విషయంలో తన అసంతృప్తిని వెళ్లగక్కడంతోనే కవిత ఆగలేదు. బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావుపై సంచలన ఆరోపణలు చేశారు. హరీశ్ రావు, బీజేపీ–ఆర్ఎస్ఎస్ మద్దతుతో బీఆర్ఎస్ పార్టీని హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇందుకోసం మెదక్‌లో రహస్య సమావేశాలు కూడా నిర్వహించారని అన్నారు. “నా సోదరుడు కేటీఆర్ చాలా అమాయకుడు, అందుకే నన్ను ఒక పథకం ప్రకారం పార్టీ నుంచి బయటకు పంపించారు” అని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ప్రస్తుతం తీవ్ర అంతర్గత సంక్షోభం నడుస్తోందని, అందుకే ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని ఆమె విమర్శించారు. పార్టీలో నెలకొన్న ఈ సంక్షోభం కారణంగానే ప్రజల పక్షాన నిలబడటంలో విఫలమవుతున్నారని అన్నారు. ప్రజలు ఈ విషయాలను గమనించి, తమలాంటి వారిని ఆశీర్వదించాలని కోరారు.

## షాద్‌నగర్‌లో కన్నీటి దృశ్యం.. సోదరుడికి కడసారి రాఖీ



తెలంగాణలోని షాద్‌నగర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాఖీ పండుగ సమీపిస్తున్న వేళ, ఓ సోదరుడు విద్యుదాఘాతంతో మరణించగా, అతని సోదరి నిర్జీవంగా పడి ఉన్న తమ్ముడికి కన్నీటితో రాఖీ కట్టింది. ఈ హృదయ విదారక దృశ్యం అక్కడున్న కుటుంబ సభ్యులు, బంధువులను శోకసంద్రంలో ముంచెత్తింది. వివరాల్లోకి వెళితే.. షాద్‌నగర్‌లోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన జమల్లాపూర్ నవీన్ (24) బుధవారం విద్యుదాఘాతంతో మరణించాడు. చాతనపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఒక దుకాణంలో ఎలక్ట్రికల్ వైర్‌కు మరమ్మతులు చేస్తుండగా, అతను ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలను తాకడంతో ఈ దుర్ఘటన జరిగింది. రెండు రోజుల్లో రాఖీ పండుగ ఉండటంతో సోదరుడి ఆకస్మిక మరణం అతని సోదరి పూజితను తీవ్రంగా కలచివేసింది. తమ మధ్య ఉన్న అన్నాచెల్లెళ్ల బంధాన్ని గుర్తుచేసుకుంటూ, ఆమె తన సోదరుడి మృతదేహానికి చివరిసారిగా రాఖీ కట్టి కన్నీటి వీడ్కోలు పలికింది. ఈ ఘటనతో నవీన్ కుటుంబంలో తీరని విషాదం అలుముకుంది. కళ్ల ముందే కొడుకు ప్రాణాలు కోల్పోవడంతో కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# కాంగ్రెస్ 1000 రోజుల మోసాలపై బీఆర్ఎస్ రణభేరి

## సెప్టెంబర్ 2 నుంచి గోషామహల్‌లో వారం రోజుల పాటు ఆందోళనలు

## - ఆర్.వి. మహేందర్ కుమార్



హైదరాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్న సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సమరశంఖం పూరించనున్నట్లు గోషామహల్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్.వి. మహేందర్ కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు నియోజకవర్గంలో వివిధ రూపాల్లో ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం కోటి బ్యాంక్ స్ట్రీట్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ, వాటి అమలులో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని పేర్కొన్నారు. "ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తుచేద్దాం.. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం" అనే నినాదంతో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి వెళ్లనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆయన ఆరోపించారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, ప్రజా సమస్యలపై నిరంతరం నిలదీస్తామని ఆర్.వి. మహేందర్ కుమార్ స్పష్టం చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు ప్రజల పక్షాన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 2 నుంచి చేపట్టనున్న కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.






## లిసర్ పూ నాగారంలో వార్డ్ సభ

నాగారం, ఆగస్టు 27:-(వాయిస్ టుడే) : ఘట్‌కేసర్ సర్కిల్ నాగారం డివిజన్ పరిధిలో పోస్ట్ ఎస్ఐఆర్-2026 కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గురువారం వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఘట్ కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియ అనంతరం ఓటర్ల జాబితాకు సంబంధించిన అంశాలు, ఓటర్ల వివరాల పరిశీలన, మార్పులు, చేర్పులు అభ్యంతరాల నమోదు, అవసరమైన పత్రాల సమర్పణ తదితర అంశాలపై అధికారులు ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని కోరారు.



## ఎస్ఐఆర్ సమస్యలపై ఎఈఆర్ఓకు కాంగ్రెస్ వినతి

### క్షేత్రస్థాయిలో ఓటర్లు, బిఎల్ఓలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాలి: కవేటి నాగార్జున

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (వాయిస్ టుడే): కూకట్‌పల్లి వార్డు కార్యాలయంలో ఎఈఆర్ఓ ఆధ్వర్యంలో వార్డు సభ/గ్రామ సభ కార్యక్రమంలో భాగంగా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కూకట్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కవేటి నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా కవేటి నాగార్జున మాట్లాడుతూ.. కార్యక్రమంలో ప్రజలు, బిఎల్ఓ లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఓటర్లకు సంబంధించిన సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశం అనంతరం క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏసిఆర్ఓ కు వినతిపత్రం సమర్పించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, ప్రజలకు సరైన సమాచారం, అవసరమైన సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో సక్రమంగా ఉండేలా, ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కవేటి నాగార్జున కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జి. నాగరాజు, బి . జ్యోతి, జి . రాజేందర్, రమణ, మేకల మహేష్ బాబు, సతీష్, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో భారీ చేరికలు

### కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ: బండి రమేష్



కూకట్‌పల్లి, ఆగస్టు 27 (వాయిస్ టుడే): కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు జరిగాయి. వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ చేరికల కార్యక్రమం టీపీసీసీ ఉపాధ్యక్షులు, తెలంగాణ కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం శుభపరిణామమన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త భాగస్వామ్యం కీలకమని అన్నారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక స్వాగతం పలికిన బండి రమేష్.. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మైనారిటీ, ఎస్సీ, బీసీ సెల్, సేవాదళ్, సోషల్ మీడియా విభాగాల నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి

### బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



సికింద్రాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు అందిస్తున్న విధంగానే బీసీ విద్యార్థులకు కూడా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహాధర్నాలో ఆయన మాట్లాడారు. బీసీ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. విద్యను పూర్తిగా అందించడంతో పాటు విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు.



## ఘనంగా ఓనం పండుగ వేడుకలు

హైదరాబాద్: ఆర్మీ క్యాంప్‌లో ఓనం పండుగ వేడుకలను ఆర్మీ కుటుంబాల ఆధ్వర్యంలో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్రతో పాటు ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఆర్మీ కుటుంబాలు ఈ వేడుకల్లో ఆప్యాయంగా పాల్గొని 'భిన్నత్వంలో ఏకత్వం' అనే భారతీయ సంస్కృతి స్ఫూర్తిని చాటిచెప్పాయని ఆర్మీ అధికారి, 'మై గిఫ్ట్' రథసారథి, ప్రముఖ కవి డా. పెరుక రాజు తెలిపారు.



## ట్రాన్స్‌ఫార్మర్ సమస్యకు వెంటనే పరిష్కారం

నాగారం, ఆగస్టు 27:-( వాయిస్ టుడే): నాగారం ప్రాంతంలో సాయి ప్రతాప్ రెసిడెన్సి లో ట్రాన్స్‌ఫార్మర్‌కు సంబంధించిన సమస్యను విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి గురువారం తక్షణమే పరిష్కరించారు. ఎఈ వంశీకృష్ణ, ఫోర్‌మెన్ లక్ష్మణ్ బాబు, లైన్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్ నాయక్, నరసింహ, అసిస్టెంట్ లైన్‌మెన్ జి. నవీన్ కుమార్‌లు స్పందించి, సిబ్బందితో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ సమస్యను పరిష్కరించారు. సమస్యను వెంటనే పరిష్కరించడంతో స్థానికులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపిన వారిలో మాజీ వార్డ్ సభ్యులు చిన్నం రాజు సాయినాథ్ గౌడ్ మరియు స్థానికులు ఉన్నారు.

## దుండిగల్ సర్కిల్‌లో బోవరంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 27(వాయిస్ టుడే): దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట లోని ఇందిరమ్మ కాలనీ ప్రక్కన వున్న 60 గజాలలో, సర్వే నెంబర్ 576లో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకున్నారు. కేవలం 120 గజాల స్థలంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా నిర్మిస్తున్న +о5 అనధికార భవనాన్ని అధికారులు కూల్చివేశారు,ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మనీ కరణ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా, చట్టాన్ని అతిక్రమించి నిర్మించే ఏ ఒక్క భవనాన్ని కూడా ఉపేక్షించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సర్కిల్ పరిధిలో తక్కువ విస్తీర్ణంలో (గజాలలో) అనుమతులు లేకుండా చేపడుతున్న అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేశామన్నారు.ఒక రకమైన అనుమతులు పొంది, దానికి విరుద్ధంగా అదనపు అనధికారిక అంతస్తులు నిర్మిస్తున్న వారిని కఠినంగా గుర్తిస్తున్నట్లు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి అక్రమ నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కూల్చివేతలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## బాచుపల్లిలో 'తెలుగింటి కిచెన్' ప్రారంభం

కుత్బుల్లాపూర్, ఆగస్టు 27(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలో రామకృష్ణ సరేపూడి నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగింటి కిచెన్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా హన్మంతన్న మాట్లాడుతూ, యువత స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. చిన్న వ్యాపారాలను ప్రోత్సహించడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు, ప్రజలకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. స్థానికంగా వ్యాపారాలు అభివృద్ధి చెందడం ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యువత ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా, తమ నైపుణ్యాలను వినియోగించుకుని స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం 'తెలుగింటి కిచెన్'ను పరిశీలించిన హన్మంత్ రెడ్డి , నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. వ్యాపారం విజయవంతంగా కొనసాగి మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొలన్ వీరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు వారాగాని వాసు, డీసీసీ జనరల్ సెక్రటరీ మౌళేశ్వర్ రావు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సత్యప్రసాద్, చిరంజీవి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ నిషేధిత జాబితా నుంచి భూములను తొలగించాలి

## హైదర్‌నగర్ సర్వే నంబర్లు 145, 163లోని కాలనీలకు న్యాయం చేయాలి: జనసేన నేత ప్రేమ్ కుమార్



కూకట్‌పల్లి:ఆగస్టు 27 (వాయిస్ టుడే): హైదర్‌నగర్ గ్రామంలోని సర్వే నంబర్లు 145, 163లో ఉన్న వసంత్‌నగర్ కాలనీ, ఎన్.ఆర్.ఎస్.ఏ కాలనీతో పాటు ఇతర కాలనీలను భూభారతి పోర్టల్‌లోని 22-ఏ నిషేధిత ఆస్తుల జాబితా నుంచి వెంటనే తొలగించాలని కూకట్‌పల్లి జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్ తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్ 145లోని సుమారు 90 ఎకరాలు, సర్వే నంబర్ 163లోని 14.26 ఎకరాల భూములు నిషేధిత జాబితాలో ఉండటంతో రిజిస్ట్రేషన్లు, బిల్డింగ్ పర్మిషన్లు, ఇతర భూ లావాదేవీలు నిలిచిపోయాయని తెలిపారు. దీనివల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ భూములకు సంబంధించిన వివాదం చాలా కాలం క్రితమే పరిష్కారమైందని, న్యాయపరంగా ప్రైవేట్ వ్యక్తుల హక్కులు ఖరారయ్యాయని ప్రేమకుమార్ తెలిపారు. గతంలో ప్రభుత్వం కూడా ప్రైవేట్ వ్యక్తుల హక్కులను గుర్తించిందని చెప్పారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మ్యూటేషన్ చేయాలని 2004లో మెమో నంబర్ 28908/జీూ×/2004-1తో పాటు 2006, 2008లోనూ మెమోలు జారీ చేశారని, 2005లో మ్యూటేషన్ ఆర్డర్ (దీ/7869/2001) కూడా ఇచ్చినట్లు వివరించారు.

అదేవిధంగా 2006--2009 మధ్య ఈ భూములకు యూఎల్‌సీ క్రమబద్ధీకరణ జరిగిందని, 1987, 1989లో హుడా నుంచి లేఅవుట్ అనుమతులు, అనంతరం జీహెచ్ఎంసీ నుంచి ఎల్ఆర్ఎస్, బిల్డింగ్ పర్మిషన్లు పొందినట్లు తెలిపారు. 2004 నుంచి ఇటీవలి కాలం వరకు ఈ భూములపై కొనుగోళ్లు, అమ్మకాలు ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగాయని పేర్కొన్నారు. వివాదం లేని భూములను ఇటీవల మళ్లీ 22-ఏ నిషేధిత జాబితాలో చేర్చడం వల్ల నిజమైన కొనుగోలుదారులు, యజమానులు తీవ్రంగా నష్టపోతున్నారని ప్రేమకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే సమస్యను పరిశీలించి ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిషేధిత ఆస్తుల జాబితా కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజల తరఫున జనసేన పార్టీ అండగా నిలిచి ఉద్యమిస్తుందని ప్రేమకుమార్ స్పష్టం చేశారు.

వాయిస్

హైదరాబాద్
శుక్రవారం 28 ఆగస్టు 2026



## ప్రజల ఓటు హక్కును కాపాడాలి

**ఎస్ఐఆర్ పై ప్రజల సందేహాలను నివృత్తి చేసి ఓట్లు గల్లంతైన వారికి న్యాయం చేయాలి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

కూకట్‌పల్లి, ఆగస్టు 27 (వాయిస్ టుడే): కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఎస్ఐఆర్ 22-ఏ నిషేధిత ఆస్తుల అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఎస్ఐఆర్ కు సంబంధించి ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడంతో పాటు ఓట్లు గల్లంతైన వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చే విధంగా కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఓటు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సరైన దిశానిర్దేశం చేయాలని కోరారు.

అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ముఖ్యంగా 22-ఏ నిషేధిత జాబితాలో ప్రజల ఆస్తులు చేర్చిన సందర్భాల్లో బాధితులకు ధైర్యం చెప్పి, వారికి అండగా నిలవాలని అన్నారు. తమ ఆస్తులను 22-ఏ జాబితా నుంచి తొలగించేందుకు రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకునే విధంగా బాధితులకు తగిన సూచనలు, సహకారం అందించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల విషయంలో వర్తించే నిబంధనల పరిధిలోకి ప్రైవేట్ ఆస్తులను ఎలా చేర్చారని ఆయన ప్రశ్నించారు. 22-ఏ అంశంపై ప్రజలు తీవ్ర గందరగోళానికి గురవుతున్నప్పటికీ ప్రభుత్వం కనీసం మానవతా దృక్పథంతో వారికి ధైర్యం కల్పించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రజల ఆందోళనలను ప్రభుత్వం గుర్తించి, 22-ఏ నిబంధనలపై తగిన నిర్ణయం తీసుకుని బాధితుల ఆస్తులను యథాస్థితికి తీసుకురావాలని మాధవరం కృష్ణారావు కోరారు. ఈ అంశంలో ప్రజల తరఫున పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం అండగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, సబేహా గౌసుద్దీన్, పగడాల శిరీషా బాబురావు, ముద్దం నరసింహ యాదవ్, పండాల సతీష్ గౌడ్, తూము శ్రావణ్ కుమార్, జూపల్లి సత్యనారాయణ, మాధవరం రంగారావుతో పాటు వివిధ డివిజన్ల అధ్యక్షులు, సెక్రటరీలు పాల్గొన్నారు.




## బ్లింకిట్ డెలివరీ సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

సికింద్రాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): రోడ్డు ప్రమాదాలను నివారించి వాహనదారులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా 'అరైవ్ అలైవ్' పేరుతో ఉస్మానియా యూనివర్సిటీ ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తార్నాకలోని మారుతీనగర్, నాగార్జుననగర్‌లో ఈ--కామర్స్ సంస్థ బ్లింకిట్ డెలివరీ సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను సక్రమంగా నిర్వహించడం, అతివేగం లేదా నిర్లక్ష్యంగా వాహనం నడపకపోవడం, రాంగ్ రూట్‌లో ప్రయాణించకపోవడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించకపోవడం వంటి అంశాలపై సిబ్బందికి వివరించారు. రోడ్డు భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో సుమారు 70 మంది బ్లింకిట్ డెలివరీ సిబ్బంది పాల్గొన్నారు.



## చిన్నక్రాంతి కాలనీలో నూతన కమిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ

### ముఖ్య అతిథిగా పాల్గొన్న చెంగిచెర్ల డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఏర్పుల మహేష్

మేడిపల్లి/సికింద్రాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల చిన్నక్రాంతి కాలనీలో శుభకార్యాలు, కాలనీ సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి నూతన కమిటీ హాల్ నిర్మాణానికి అడుగు పడింది. స్థానిక కాలనీ వాసుల సుదీర్ఘకాల నిరీక్షణకు తెరదించుతూ, ఎంపీ ఈటెల రాజేందర్ నిధులతో మంజూరైన ఈ కమిటీ హాల్ నిర్మాణ పనులను చెంగిచెర్ల డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఏర్పుల మహేష్, నాయకుడు అగ్గి రమేష్ గౌడ్,కాలనీ అధ్యక్షుడు మేడ బాపురాజు భూమిపూజ చేసి అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున కాలనీవాసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు మేడ బాపురాజు,కమిటీ సభ్యులు మాట్లాడుతూ... తమ కాలనీకి ఒక కమిటీ హాల్ అత్యవసరమని ఎంపీ ఈటెల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లగానే, ఆయన వెంటనే స్పందించి రూ. ఎంపీ లాడ్స్ నిధుల నుండి నిధులు మంజూరు చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న ఎంపీ ఈటెల రాజేందర్ కు, అలాగే ఈ పనులు వేగంగా మంజూరయ్యేలా చొరవ చూపిన ఏర్పుల మహేష్, అగ్గి రమేష్ గౌడ్ ల ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఏర్పుల మహేష్ మాట్లాడుతూ... ప్రాంత అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఎంపీ ఈటెల రాజేందర్ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని స్పష్టం చేశారు. కమిటీ హాల్ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ కమిటీ నాయకులు నీలుగొండ వెంకటేష్ గౌడ్,రాజేందర్ రెడ్డి, విక్రమ్ గౌడ్, సుల్వ రవీందర్,శ్రీనివాస్, శ్రీకాంత్, నరేష్ గౌడ్, సాయిలు గౌడ్, నవీన్, రవికృష్ణ గౌడ్, గుగ్గిళ్ళ భాస్కర్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

# పి.ఆర్.సి ప్రకటించాలి

**డి.ఎ బకాయిల వెంటనే చెల్లించాలి..**

**టిజిఈజేఏసీ..**

**ధర్నా చౌక్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల మహాధర్నా..**




సికింద్రాబాద్, ఆగస్టు 27(వాయిస్ టుడే ప్రతినిధి): పెండింగ్ లో ఉన్న డి ఎ బకాయిలను చెల్లించాలని, పి ఆర్ సి వెంటనే ప్రకటించాలని, నూతన ఆరోగ్య భీమా పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద గల ధర్నా చౌక్ లో హైదరాబాద్ జిల్లా, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగారు. టీజీఈ జేఏసీ పిలుపుమేరకు 33 జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిర్వహించిన మహాధర్నాలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా టీజీఈ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పట్ల ఉన్న గౌరవంతో ఇంతకాలం ఓపికగా ఎదురుచూశామని, ప్రభుత్వ సూచన మేరకు క్యాబినెట్ సబ్ కమిటీ, అధికారుల కమిటీ, మంత్రులను పలుమార్లు కలిసినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని, ఇప్పటికైనా పెండింగ్ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, పిఆర్సి అమలు, డి ఎ బకాయిల చెల్లింపుపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మహాధర్నా ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక అని, డిమాండ్లను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ మహాధర్నాలో యుటిఎఫ్, టిఆర్ఈఎస్ఏ, ఎస్టియు, టిఎన్జీవో, టీజీవో, టీజీఎల్ఏ, క్లాస్-4 ఉద్యోగ సంఘాలు, పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు పాల్గొని ప్రసంగించారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు హాజరై తమ డిమాండ్లకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా, హైదరాబాద్ సిటీ, రంగారెడ్డి జిల్లా జేఏసీ నాయకులు విక్రమ్ కుమార్, ఎం.బి. కృష్ణ యాదవ్, శ్రీకాంత్, గండూరి వెంకటేశ్వర్లు, రామారావు, యశ్వంత్, శ్రీనేష్ కుమార్, నిరంజన్, శ్రీనివాస్, ఖాదర్, చందు తదితరులు పాల్గొన్నారు.




## క్రీడలకు సమాన ప్రాధాన్యతతో భారత్‌ను అగ్రస్థానంలో నిలపాలి: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

సికింద్రాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిస్తూ భారతదేశాన్ని ప్రపంచ క్రీడా రంగంలో అగ్రస్థానంలో నిలపాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఈఎఫ్ఎల్‌యూ) ఓయూ క్యాంపస్‌లో నిర్వహించిన 'ఖేలో ఇండియా సంభాషణ--ప్రధానితో క్రీడల మాట' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశవ్యాప్తంగా 1,500 విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు, యువ క్రీడాకారులతో ఆన్‌లైన్‌లో మాట్లాడారని, ఈ కార్యక్రమంలో సుమారు 10 లక్షల మంది పాల్గొన్నారని తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ స్థాయి నుంచే క్రీడాకారులను ప్రోత్సహిస్తుండటంతో అంతర్జాతీయ వేదికలపై భారత క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారని చెప్పారు.

అంతర్జాతీయ పోటీలకు వెళ్లే క్రీడాకారులను ప్రధాని స్వయంగా కలుసుకుని ప్రోత్సహిస్తున్నారని, విజేతలను అభినందించడంతో పాటు ఓటమి చెందిన క్రీడాకారులకు ధైర్యం చెబుతున్నారని పేర్కొన్నారు. క్రీడాకారులకు పౌష్టికాహారం, ఆధునిక శిక్షణతో పాటు ప్రపంచస్థాయి కోచ్‌ల వద్ద శిక్షణ పొందే అవకాశాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. 2030 కామన్వెల్త్ క్రీడలకు భారత్ ఆతిథ్యం ఇవ్వనున్న నేపథ్యంలో, 2036 ఒలింపిక్ క్రీడలను కూడా దేశంలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కిషన్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే స్థాయికి భారత క్రీడారంగాన్ని తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల నిర్వాహకులు చదువుతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాలని సూచించారు. అందరి సమిష్టి కృషితో భారత్ ప్రపంచ క్రీడా రంగంలో అగ్రస్థానానికి చేరుకుంటుందని కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మై భారత్ పోర్టల్ డైరెక్టర్ అన్వేష్, భారత సమాచార ప్రసార విభాగం అదనపు మహా సంచాలకురాలు శ్రుతి పాటిల్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎన్. నాగరాజు, రిజిస్ట్రార్ సినీ మంచాల తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి.. అప్రమత్తంగా ఉండండి..!

### హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్



సికింద్రాబాద్ ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): వైద్యం పేరిట అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సి వి సజ్జనార్ సూచించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కట్టుబడిన హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతున్నామని తెలిపారు. తాజాగా నగరంలో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకున్నాన్నారు. ఎలాంటి విద్యార్హతలూ, కనీస వైద్య పరిజ్ఞానం లేని వీరు అసలైన వైద్యుల తరహాలోనే నటిస్తూ రోగులకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, మధుమేహం మందులతో పాటు విచక్షణారహితంగా ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నారని చెప్పారు. అవగాహనారాహిత్యంతో రోజుల తరబడి మందులు వాడాలని సూచించడంతో ప్రజల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయనీ, ఇలాంటి మోసగాళ్లపై మా నిఘా, కఠిన చర్యలు కొనసాగుతుండగా.. ప్రజలు కూడా చికిత్స కోసం వెళ్లే ముందు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలనీ విజ్ఞప్తి చేశారు.

తాము వెళ్లే క్లినిక్‌లు, ఆసుపత్రుల రిసెప్షన్ వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ (ఐవీఎూ) జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను ప్రముఖంగా ప్రదర్శించారో లేదో గమనించాలన్నారు. అలాగే వైద్యుల బోర్డులపై పేరు, విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టావీజ) కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. వైద్యుల వివరాలపై ఏమాత్రం సందేహం కలిగినా వెంటనే శీఅశ్రీఱఅవ్ంఎ౩.ఱఅ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఐశీఖ్ఞశీఖ్ఞ ౯ాఝతీఎష్టర్‌లో పేరు లేదా రిజిస్ట్రేషన్ నంబర్ నమోదు చేసి వారి వివరాలను సరిచూసుకోవచ్చు. అక్కడ వివరాలు కనిపించకపోతే వారు నకిలీలని గుర్తించాలనీ చెప్పారు. చికిత్స విధానం లేదా సిబ్బంది ప్రవర్తనపై ఏమాత్రం అనుమానం వచ్చినా తక్షణం అర్హత గల ఇతర నిపుణులైన వైద్యుల వద్ద రెండో అభిప్రాయం తీసుకోవాలి. ఎక్కడైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేసి అమాయకుల ప్రాణాలను కాపాడాలని కోరారు.

# ఎమర్జెన్సీ తరహాలో కాంగ్రెస్ పాలన

**బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**



సికింద్రాబాద్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): ఎమర్జెన్సీ తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన తెలంగాణలో కొనసాగిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు ఆరోపించారు. సమస్యలపై ప్రశ్నించే ప్రతిపక్షాలు, విద్యార్థులపై పోలీసు నిర్బంధాలను ప్రయోగిస్తోందన్నారు. ఈ మేరకు గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... రామంతాపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులను కలిసి వారి సమస్యలు తెలుసుకుని మద్దతు తెలిపేందుకు వెళ్తున్న తనను తార్నాకలోని నివాసంలో పోలీసులు ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. తన నిరాహార దీక్షా శిబిరానికి వచ్చి సమస్యలను వివరించిన విద్యార్థులను పరామర్శించేందుకు వెళ్తుండగా ఇంటి చుట్టూ భారీగా పోలీసులను మోహరించి అడ్డుకోవడం ప్రభుత్వ పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును జీవో 97 ద్వారా ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని, ఈసెట్ ద్వారా ఇంజనీరింగ్‌లో ప్రవేశం పొందే అవకాశాలను దెబ్బతీసే నిర్ణయాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే లాఠీఛార్జీలు, కేసులతో అణచివేయడం సరికాదన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీతో కాలయాపన చేయకుండా జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు సకాలంలో అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఆయుష్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లకు స్టైఫండ్లు సక్రమంగా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో పీజీ విద్యార్థులకు నెలకు రూ.26 వేలు, సూపర్ స్పెషాలిటీ విద్యార్థులకు రూ.30 వేల వరకు స్టైఫండ్లు ఇస్తుండగా, తెలంగాణలో రూ.13 వేల నుంచి రూ.15 వేలకే పరిమితం చేశారని విమర్శించారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, లెక్చరర్ల కొరతతో విద్యా వ్యవస్థ దెబ్బతింటోందని అన్నారు. విద్యాశాఖను నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. పోలీసుల ఆంక్షలు తొలగిన వెంటనే రామంతాపూర్ పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసి వారి సమస్యలపై బీజేపీ అండగా నిలుస్తుందని, విద్యార్థుల హక్కులు సాధించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం కొనసాగిస్తామని రాంచందర్‌రావు స్పష్టం చేశారు.

వాయిస్
హైదరాబాద్
శుక్రవారం 28 ఆగస్టు 2026



## భూముల రీ సర్వే వివరాలు పక్కాగా నమోదు చేయాలి

### రైతులకు ముందస్తు సమాచారం అందించి పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలి

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంట, ఆగస్టు 27 (వాయిస్ టుడే): భూ భారతి కింద చేపడుతున్న భూముల రీ సర్వే వివరాలను పక్కా గా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అధికారులను ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం సిరి కొండ గ్రామం లో భూ భారతి కింద రోవర్ యంత్రం తో కొన సాగుతున్న భూముల రీ సర్వే పనులను గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, అటవీ శాఖ అధికారులతో కలిసి సర్వే ప్రక్రియను పరిశీలించి, భూముల వివరాలను ఏ విధంగా సేకరిస్తున్నారనే అంశాలను అధికారులను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భం గా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణం గా జిల్లాలో భూ భారతి కింద భూముల రీ సర్వే పనులను పకడ్బందీగా పూర్తి చేయాలని సూచించారు. సర్వే కు సంబంధించిన వివరాల్లో ఎలాంటి పొరపాట్ల కు తావు లేకుండా కచ్చితత్వంతో నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామం లో రీ సర్వే నిర్వహించే విషయాన్ని రైతులకు ముందుగానే తెలియజేసి, వారి సహకారం తో సర్వే ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, తహసీల్దార్ సురేష్, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రత్యేక సమగ్ర సవరణ 2026 ముసాయిదా

### ఓటర్ జాబిత పరిశీలన కార్యక్రమం

### వార్డు సభలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ శ్రీ మొలుగు ప్రశాంత్ కుమార్

జమ్మికుంట ఆగస్టు 27 (వాయిస్ టుడే): జమ్మికుంట పట్టణ పరిధిలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) 2026 ముసాయిదా ఓటర్ జాబిత పరిశీలన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొన్నటి వరకు మనం SIR ఫారం నింపి ఓటర్లవన్నీ కూడా సబ్మిట్ చేయడం జరిగింది ఎవరైనా కొంతమంది 2002 లో వాళ్ల తల్లిదండ్రుల సంబంధించినటువంటి వివరాలు నింపకపోయినా, వాళ్లు సరైన రికార్డులు ఇవ్వకపోయినా,తిరిగి మళ్లీ వాళ్లకు నోటీసులు ఇచ్చి వాళ్ల దగ్గర నుంచి మళ్లీ సమాచారం తీసుకోవడానికి ఈరోజు రెవెన్యూ వాళ్లు, దీూా వాళ్లు, మున్సిపల్ వాళ్లు అందరూ కూడా మీకు అందుబాటులో ఉండడం జరిగింది అని, మీ ఓటర్లలో పేరు తప్పుగా నమోదైనా, అందులో ఇంటి నెంబర్ తప్పుగా నమోదైనా, లేకపోతే ఓటు మిస్ అయినా గానీ మీరు వెంటనే సంబంధించినటువంటి దీూా కి గానీ, వార్డ్ ఆఫీసర్లకు గానీ, లేదూ రెవెన్యూ ఆఫీస్‌లో గానీ సంప్రదించాలి ఎందుకంటే ఒకసారి ఇప్పుడు గనుక ఈ ముసాయిదాలో గనుక మీ ఓటు పోతే మళ్లీ ఓటు రాదు దయచేసి సకాలంలో అందరూ కూడా, అందుబాటులో ఉన్న వాళ్లందరూ కూడా దీూా లకు గానీ, వార్డ్ ఆఫీసర్, రెవెన్యూ వాళ్లకు ఈ సమాచారం తెలియజేసి మీ ఓటును మళ్లీ తిరిగి నమోదు చేసుకోవడానికి మా వంతుగా మా వాళ్లందరూ కూడా ఉంటున్నారు కాబట్టి ప్రజలందరూ కూడా దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి రాము,శ్రా విజయ, సరళ, BLO\T,GPO శ్రావణ్ అంగన్వాడి టీచర్స్ మరియు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ రహదారి పక్కన చెత్త వేయొద్దు - కలెక్టర్ చిత్రా మిశ్రా

హుజురాబాద్ ఆగస్టు 27 (వాయిస్ టుడే): హుజూరాబాద్ మండలం సిర్సపల్లి సమీపంలో జాతీయ రహదారి(ఎన్‌హెచ్ -563) పక్కనే ఉన్న మున్సిపల్ డంపింగ్ యార్డును కరీంనగర్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా గురువారం రాత్రి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైవేను ఆనుకుని డంపింగ్ యార్డు ఉండటంపై భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అభ్యంతరం వ్యక్తం చేసిన నేపథ్యంలో కలెక్టర్ ఈ స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మున్సిపల్, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతంలో తక్షణమే చెత్త వేయడం నిలిపివేయాలని, రహదారికి దూరంగా ఉన్న ప్రదేశంలోనే డంప్ చేయాలని స్పష్టం చేశారు. రహదారికి సమీపంలోని స్థలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి, పచ్చదనం (గ్రీనరీ) అభివృద్ధి చేయాలని సూచించారు. పట్టణంలోని వివిధ డివిజన్ల నుంచి చెత్త సేకరించే వాహనాలు జాతీయ రహదారి గుండా కాకుండా, ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా డంపింగ్ యార్డుకు చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేసి వాహనాల రాకపోకలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో జల కుమారి, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ భరద్వాజ్, తహసీల్దార్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపినఎంపీ వద్దిరాజు

ఖమ్మం ,ఆగస్టు 27 ( వాయిస్ టుడే): తెలంగాణ సోదర సోదరీమణులకు ఎంపీ వద్దిరాజు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి (శ్రావణ పున్నమి) సందర్భంగా అక్కాతమ్ముళ్లు,అన్నాచెల్లెళ్లకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ పండుగను దేశమంతటా ఘనంగా జరుపుకుంటారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాఖీ పౌర్ణమి అనేది అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు,రక్షణకు ప్రతీకగా జరుపుకునే అత్యంత ముఖ్యమైన హైందవ పండుగ అని ఎంపీ రవిచంద్ర చెప్పారు.సోదరీమణులు తమ సోదరుల నుదుట బొట్టు పెట్టి కుడి చేతి మణికట్టుకు రాఖీని (రక్షా సూత్రాన్ని)కట్టి వారి శ్రేయస్సు, ఆయురారోగ్యాలు బాగుండాలని భగవంతున్ని ప్రార్థిస్తారన్నారు.ఈ సందర్భంగా సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు జీవితాంతం తోడుగా ఉంటామని అభయమిస్తూ పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటారని, బహుమతులు,కానుకలు అందజేస్తారని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఈ పండుగ కేవలం రక్తసంబంధీకులకు మాత్రమే కాకుండా సమాజంలో సోదర,పరస్పర రక్షణ భావాన్ని పెంపొందించడానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) పర్వదినం సందర్భంగా తెలంగాణ సోదర సోదరీమణులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.







## రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, పెన్షనర్లకు నూతన పి ఆర్ సి ని ప్రకటించి, ఈ హెచ్ ఎస్‌ను వెంటనే అమలు చేయాలి

### కరీంనగర్ జిల్లా టిజిఈ జేఏసీ డిమాండ్

హుజూరాబాద్ ఆగస్టు 27 (వాయిస్ టుడే): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ జేఏసీ పిలుపుమేరకు గురువారం రోజు కరీంనగర్ జిల్లా జేఏసీ కన్వీనర్ దారం శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన కరీంనగర్ కలెక్టరేట్ ముందు మహా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ జూలై 2023 నుండి అమలు చేయాల్సిన పి ఆర్ సి ని వాయిదా వేస్తూ, ఆరు డి ఎ లను పెండింగ్ లో ఉంచడం హాస్యాస్పదంగా ఉందని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి నూతన పిఆర్సిని జూలై 2023 నుండి అమలుపరుస్తూ, పెండింగులో ఉన్న ఆరు డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఈ సందర్భంగా కోరినారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా సిపిఎస్ ను రద్దు పరుస్తూ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని,పెన్షనర్ల పెండింగ్ బిల్లులన్నింటినీ ఏక మొత్తంగా మంజూరు చేసి, నూతన ఈ హెచ్ ఎస్ పథకాన్ని ఏమాత్రం ఆలస్యం లేకుండా రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో ఉద్యోగ, పెన్షనర్లకు వెంటనే అమలయ్యే విధంగా చూడాల్సినటువంటి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం పైన ఉందని డిమాండ్ చేసినారు. అదేవిధంగా స్పెషల్ టీచర్లకు నో షనల్ ఇంక్రిమెంట్లను తగిన విధంగా మంజూరు చేస్తూ, రాష్ట్ర పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేటును ఏర్పాటు చేయాలని సూచించినారు. కార్యక్రమంలో టా ప్ర హుజురాబాద్ అధ్యక్షుడు భారత ప్రభాకర్,ప్రధాన కార్యదర్శి చీకట్ల సమ్మయ్య బాధ్యులు బొంగోని వెంకటయ్య, చొల్లేటి మల్లారెడ్డి, మండల వీరస్వామి గౌరీశెట్టి సాంబయ్య, తాటిపాముల కనుకయ్య,గాజర్ల బుచ్చిరాజం, పెదపాటి రమేష్,తిరునగరి రమేష్,పరాంకుశం సనత్ కుమార్, నల్లా రాజిరెడ్డి,చాడ సమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

### రాష్ట్ర, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 27 (వాయిస్ టుడే): భక్తి శ్రద్ధల తో కోటి కుంకుమ అర్చన, ఆధ్యాత్మిక చింతన తో మానసిక ప్రశాంతత లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.గురు వారం సిరిసిల్ల పట్టణం లో శ్రీ హరి హర పుత్ర అయ్యప్ప దేవస్థాన ట్రస్టు ఆధ్వర్యం లో 5 రోజులగా నిర్వ హిస్తున్న కోటి కుంకుమ అర్చన, ఉచిత సామూహిక సత్యనారాయణ వ్రత కార్యక్రమాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భం గా అయ్యప్ప స్వామి వారి ని దర్శించుకున్న విప్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు.ఈ సందర్భం గా ఆలయ నిర్వాహకులు, ట్రస్టు సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను సన్మానించారు. ప్రజలందరూ ఆధ్యాత్మిక భావన తో, భక్తి శ్రద్ధల తో కార్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని విప్ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, సూర దేవరాజు, చొప్పదండి ప్రకాష్, గడ్డం నర్సయ్య, అకునూరి బాలరాజు, జిల్లా నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు పాల్గొనారు.

## బ్లూ బెల్స్ హైస్కూల్‌లో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు



కరీంనగర్ ఆగస్టు 27 (వాయిస్ టుడే): కరీంనగర్ పట్టణం లోని హనుమాన్ నగర్‌లో గల బ్లూ బెల్స్ హైస్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ఉన్న ప్రేమానుబంధం, ఆప్యాయత, పరస్పర రక్షణ భావాలను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సోదరులకు సంప్రదాయబద్ధంగా రాఖీలు కట్టి, స్వీట్లు పంచుకుని రక్షాబంధన్ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. రాఖీ కట్టే కార్యక్రమం ద్వారా సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యత, పరస్పర రక్షణ వంటి విలువలను విద్యార్థులకు తెలియజేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మందల మల్లారెడ్డి హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి మాట్లాడుతూ, రక్షాబంధన్ కేవలం రాఖీ కట్టుకునే పండుగ మాత్రమే కాకుండా, కుటుంబ బంధాలను బలోపేతం చేసే గొప్ప భారతీయ సంప్రదాయానికి ప్రతీక అని తెలిపారు. విద్యార్థులు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటి విలువలను జీవితంలో ఆచరించాలని సూచించారు. విద్యార్థుల ఉత్సాహభరితమైన పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. కార్యక్రమంలో మందల మల్లారెడ్డి, ప్రిన్సిపల్ జంగ సునీత మనోహర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి రేణుకుంట్ల శివకుమార్‌కు రాఖి కట్టిన మంత్రి కొండా సురేఖ

వరంగల్ ( వాయిస్ టుడే) ఆగష్టు 27 : నగరంలోని ములుగు రోడ్డు వజ్ర గార్డెన్ లో గురువారం ఒక పెళ్లి కార్యక్రమానికి తెలంగాణ దేవాదాయ, అటవీ మరియు పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరైనారు. ఇదే కార్యక్రమనికి వచ్చిన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి కొండా యువసేన అధ్యక్షుడు రేణుకుంట్ల శివకుమార్‌కు శుక్రవారం రాఖీ పండుగ సందర్బంగా ముందస్తు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్బంగా శివకుమార్ మంత్రి కొండా సురేఖ నుండి ఆశీస్సులు తీసుకోవడం జరిగింది.

## న్యూ కౌంటిల్యాస్ సెయింట్ ఆమెన్ హై స్కూల్‌లో రక్షాబంధన్ వేడుకలు

వరంగల్ (వాయిస్ టుడే) ఆగష్టు 27 : కరీమాబాద్ ప్రాంతంలో గల న్యూ కౌటిల్య సెయింట్ ఆమెన్ హైస్కూల్లో గురువారం నాడు రక్షాబంధన్ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా కరస్పాండెంట్ కోడం శ్రీధర్ హాజరయ్యారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నీవు నాకు రక్ష నేను నీకు రక్ష మనము దేశానికి రక్ష అని నినాదించి అనంతరం రాఖీలు కట్టుకొని సోదర భావాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా స్కూలు కరెస్పాండెంట్ కోడం శ్రీధర్ మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అను బంధానికి ప్రతిరూపం రక్షాబంధనం అని , ఇది పురాణాల నుంచి వస్తున్న మన హిందూ సంస్కృతి అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు కోడం సబిత మాట్లాడుతూ పాఠశాలలోనే కాకుండా నిజజీవితంలో ప్రతి ఒక్కరితో సోదర భావంతో మెలగాలని తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుమారు 800 మంది విద్యార్థినీ విద్యార్థులు రాఖీలు కట్టుకున్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



వాయిస్ ఆఫ్ ప్రజలు


# ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉంది




**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**రెండో పీఆర్సీ, సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏలపై త్వరలో శుభవార్త**

**ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి**

**సీఎం రేవంత్‌రెడ్డితో ఇప్పటికే సమస్యలపై చర్చించాలి**

**అవసరమైతే ఉద్యోగులతో కలిసి సీఎంను కలుస్తా..**

హనుమకొండ, ఆగస్టు 27 (వాయిస్ టుడే): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండలో తెలంగాణ ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కావాలన్నదే తన ఆకాంక్ష అని అన్నారు. సమస్యలపై పోరాడకుండా తప్పించుకుని తిరగడం తనకు అలవాటు లేదని స్పష్టం చేశారు.

ఉద్యోగుల సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఇప్పటికే చర్చించిన తర్వాతే తాను ధర్నాకు హాజరైనట్లు తెలిపారు. రెండో పీఆర్సీ అమలు, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్) పునరుద్ధరణ, పెండింగ్‌లో ఉన్న డీఏల మంజూరు, ఉద్యోగులు--పెన్షనర్ల సమస్యల పరిష్కారం వంటి ప్రధాన డిమాండ్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే శుభవార్త వస్తుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. హెల్త్ కార్డులు, రిటైర్మెంట్‌కు సంబంధించిన సమస్యలతో పాటు ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇతర ఇబ్బందుల పరిష్కారానికి సంబంధిత మంత్రులు, ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఒక్కో సమస్యను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగులు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని నాయిని కోరారు. అవసరమైతే ఉద్యోగులతో కలిసి ముఖ్యమంత్రిని కలసి సమస్యలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా, వ్యవస్థాత్మకంగా ముందుకు సాగాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఉద్యోగులు వివిధ రాజకీయ పార్టీలకు అభిమానులుగా ఉండవచ్చని, అయితే ఉద్యోగుల సమస్యల పరిష్కారం విషయంలో అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి, సమన్వయంతో ముందుకు వెళ్తే సమస్యలు తప్పకుండా పరిష్కారమవుతాయన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. తాను ధర్నాకు వచ్చే ముందు కూడా ప్రభుత్వ పెద్దలతో ఉద్యోగుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించానని, సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలి అనే అంశాలపై చర్చించిన అనంతరమే ధర్నాకు హాజరైనట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఆశీర్వాదంతో వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల జేఏసీ ప్రతినిధులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.




## దోమల నివారణకు పూసాలలో స్ప్రేయింగ్

**- డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, వ్యాధుల నియంత్రణకు చర్యలు**

సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఆగస్టు-27 వాయిస్ టుడే: సుల్తానాబాద్ మున్సిపల్ పట్టణ పరిధి పూసాలలో డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తితో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, తో కలిసి కౌన్సిలర్ వేగోళం పద్మ అబ్బయ్య గౌడ్ అధ్యక్షతన దోమల నివారణ మందును పిచికారీ చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని పలు ప్రాంతాల్లో దోమల నివారణ మందును స్ప్రే చేయడంతో పాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇళ్ల చుట్టుపక్కల నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అపరిశుభ్రతకు తావివ్వకుండా పారిశుధ్య చర్యలు పాటించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో ఇలాంటి పారిశుధ్య, దోమల నివారణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, పదమూడవ వార్డు కౌన్సిలర్ సిద్ధ తిరుపతి, విలేజ్ డాక్టర్ సమీరా, ఆశా వర్కర్ పద్మతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నస్తీపూర్ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా రాఖీ సంబరాలు



నర్సాపూర్ (వాయిస్ టుడే): శ్రావణమాసం పురస్కరించుకొని రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని నస్తీపూర్ ప్రాథమిక పాఠశాల లో గురువారం నాడు రాఖీ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు లోకనాథం మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా ఈ రాఖీ పండుగ జరుపుకుంటాం కానీ ప్రతి ఆడపిల్లకు మగవారు రక్షణగా ఉండాలనే సంకల్పంతో మగవాళ్ళు బాగుండాలనే ఉద్దేశంతో ఈరోజు అందరికీ రాఖీలు కట్టించడం జరిగిందన్నారు. విద్యార్థి దశలోనే స్త్రీలను గౌరవించడం మన సాంప్రదాయం ఉన్నారు ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు లోకనాథం, ఉపాధ్యాయులు నరేష్, వాలంటీర్ ప్రవళిక, విద్యార్థులు పాల్గొన్నారు

## సాదుల్ నగర్ గ్రామంలో గ్రామ సభ



నర్సాపూర్ (వాయిస్ టుడే) : ఎస్సార్ ప్రక్రియ లో భాగంగా సాధు లానగర్ గ్రామంలో గురువారం నాడు గ్రామసభ నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ జిపిఓ వినోద్ మాట్లాడుతూ ఎస్సార్లు తిరస్కరణకు గురి అయిన జాబితాలో గ్రామ పెద్దల సమక్షంలో గ్రామ ప్రజలకు వివరించడం జరిగిందని ఆయన తెలిపారు ఎస్సార్ ప్రక్రియ తిరస్కరణ అయినవారు తాము చెప్పిన పేపర్స్ గ్రామపంచాయతీ దగ్గరకు బి ఎల్ వో గారికి అందజేయాలని జిపిఓ తెలిపారు ఎలాంటి సందేహం ఉన్న తమ దృష్టికి తేవాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు

## మాజీమంత్రి హరీష్‌రావు అరెస్ట్..

**హనుమకొండ కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళనకు మాజీ మంత్రి మద్దతు**

**"పాలిటెక్నిక్ విద్యార్థులు ఏమైనా టెర్రరిస్టులా?" అంటూ పోలీసుల తీరుపై ఆగ్రహం**

**టీఎన్జీఓల ధర్నాకు సంఘీభావం తెలిపిన హరీష్‌రావు**

**హరీష్‌రావు అరెస్ట్.. సుబేదారి పోలీస్‌స్టేషన్‌కు నడుచుకుంటూ వెళ్లిన నేత**




హనుమకొండ జిల్లా, ఆగస్టు 27 (వాయిస్ టుడే): హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు తమ సమస్యల పరిష్కారం కోసం, ముఖ్యంగా జీఓ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనకు మద్దతు తెలిపేందుకు హనుమకొండకు వచ్చిన బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో టీఎన్జీఓలు నిర్వహిస్తున్న ధర్నాకు కూడా హరీష్‌రావు సంఘీభావం తెలిపారు.

హరీష్‌రావు పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు ఉదయాన్నే హైదరాబాద్‌లోని ఆయన నివాసంలోనే అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ, ఆయన అన్ని ఆంక్షలను దాటుకుని హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ ధర్నాలో పాల్గొని విద్యార్థుల సమస్యలకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ "పాలిటెక్నిక్ విద్యార్థులు ఏమైనా టెర్రరిస్టులా?" అంటూ ప్రశ్నించారు. హరీష్‌రావు రాకతో కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులతో వాగ్వాదానికి దిగకుండా హరీష్‌రావు పక్కనే ఉన్న సుబేదారి పోలీస్‌స్టేషన్ వరకు నడుచుకుంటూ వెళ్లారు.

హరీష్‌రావు అరెస్ట్‌పై బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులకు, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజా సమస్యలపై శాంతియుతంగా స్పందిస్తున్న ప్రతిపక్ష నాయకులను పోలీసులు నిర్బంధించడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య గొంతును నొక్కే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపించాయి. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో హనుమకొండ కలెక్టరేట్ పరిసరాల్లో భారీగా పోలీసు బలగాలను మోహరించి భద్రతను కట్టుదిట్టం చేశారు.



## దాస్యం వినయ్ భాస్కర్ ఇంటి వద్ద ఉద్రిక్తత.. భారీగా పోలీసుల మోహరింపు

**పాలిటెక్నిక్ విద్యార్థులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తుండగా హౌస్ అరెస్ట్**

**కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్ష గొంతును అణిచివేస్తోందని దాస్యం వినయ్ భాస్కర్ ఆరోపణ**

**అక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులు నిలిపివేయాలని డిమాండ్**

**విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి**

హనుమకొండ, ఆగస్టు 27 (వాయిస్ టుడే): ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, వరంగల్ పశ్చిమ మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్ ఇంటి వద్ద గురువారం ఉద్రిక్తత నెలకొంది. వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు సంఘీభావం తెలిపేందుకు వెళ్తున్న దాస్యం వినయ్ భాస్కర్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. హనుమకొండ లోని ఆయన ఆయన నివాసానికి భారీగా పోలీసులు చేరుకుని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేయాలని చూస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న నియంతృత్వ చర్యలు ప్రజాస్వామ్య హక్కులను హరిస్తున్నాయని విమర్శించారు. జీఓ 97 ద్వారా విద్యార్థులపై ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన విధానాలను ప్రశ్నిస్తున్న నాయకులను అణచివేసే ప్రయత్నం చేస్తోందని అన్నారు. శాంతియుతంగా విద్యార్థులకు అండగా నిలవాలనుకున్న తమ నాయకుడు, మాజీ మంత్రి హరీష్‌రావును పోలీసులు అడ్డుకోవడం, నిర్బంధించడం అప్రజాస్వామికమని దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అక్రమ నిర్బంధాలు, ముందస్తు అరెస్టులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆందోళనలను అణచివేసే ప్రయత్నాలను ప్రభుత్వం మానుకోవాలని కోరారు. దేశంలో జెన్-జీ ఉద్యమం నడుస్తోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థి, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్ల పాలనలో అన్ని వర్గాలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. పేదల భూములను 22ఏ పేరుతో లాక్కునేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను అమలు చేసే వరకు తెలంగాణ ప్రజల పక్షాన బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని దాస్యం వినయ్ భాస్కర్ స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని ఎవరూ అడ్డుకోలేరని అన్నారు. వినయ్ భాస్కర్ ను హౌస్ అరెస్ట్ చేసిన సమయంలో ఆయన వెంట మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, నాయకులు రాంమూర్తి, ప్రణయ్, రమేష్ తదితరులు ఉన్నారు.



## ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఇనగాల

**49వ డివిజన్‌లో వార్డ్ సభలు, ఓటరు నమోదు కేంద్రాల సందర్శన**

**ఆత్మకూరు గ్రామ సభలో కలెక్టర్‌తో కలిసి ఓటరు జాబితాపై సమీక్ష**

**అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి**

**తప్పులు లేని పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించాలి**

హనుమకొండ జిల్లా, ఆగస్టు 27 (వాయిస్ టుడే): ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (SIR) కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న వార్డ్ సభలు, ఓటరు నమోదు--సవరణ కేంద్రాలను హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 49వ డివిజన్‌లోని రామాలయం, ట్రైబల్ వెల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్డ్ సభలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు నిర్వహిస్తున్న ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన, ఓటరు నమోదు, సవరణ ప్రక్రియలను ఇనగాల వెంకట్రామ్ రెడ్డి దగ్గరుండి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని అన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. తప్పులు లేని, పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు, సమన్వయకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం హనుమకొండ జిల్లా ఆత్మకూరు గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామ సభకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ ఛాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి ఓటరు జాబితాలో అభ్యంతరాలు, కొత్త ఓట్ల నమోదు, చేర్పులు, మార్పులపై స్థానిక ప్రజలతో చర్చించారు. ముసాయిదా ఓటరు జాబితాలో మార్పులకు సంబంధించి గ్రామస్తులు లేవనెత్తిన పలు సందేహాలను అధికారుల సమక్షంలో నివృత్తి చేశారు.

రాబోయే ఎన్నికల దృష్ట్యా అర్హులైన ఏ ఒక్కరికీ ఓటు హక్కు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కోరారు. అదే సమయంలో మరణించిన వ్యక్తుల పేర్లు, డూప్లికేట్ ఓట్లను పూర్తి నిబంధనలను పాటిస్తూ తొలగించాలని కలెక్టర్, రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుగ్గా పాల్గొని తమ వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో 49వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగపురి కిరణ్, మాజీ కార్పొరేటర్ రామ్ ప్రసాద్, జిల్లా కాంగ్రెస్ డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు — VOICE OF PRAJALU — ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
శుక్రవారం 28 ఆగస్టు 2026



## జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాలు నిషేధించాలి

**- హోటల్స్ దాబాల పక్కన బారీ వాహనాలను నిలిపితే కఠినచర్యలు**

**- హుజూర్ నగర్ ఎస్ఐ చలికంటి నరేష్**

హుజూర్‌నగర్, ఆగస్టు 27 (వాయిస్ టుడే ప్రతినిధి): జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాలు నిషేధించాలని, హోటల్స్ దాబాల పక్కన బారీ వాహనాలను నిలిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ చలికంటి నరేష్ హెచ్చరించారు. హుజూర్‌నగర్ పట్టణంలోని నేషనల్ హైవే వెంట ఉన్న బెల్ట్ షాపులు, హోటళ్లు, కిరాణా దుకాణాల యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై నరేష్ మాట్లాడుతూ.. నేషనల్ హైవే వెంట ఉన్న ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద జరిగే ప్రతి కార్యకలాపం నిఘాలో ఉండేలా కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత పెంచవచ్చని తెలిపారు. దుకాణ యజమానులు పోలీసులకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. అదేవిధంగా నేషనల్ హైవేపై వాహనాలను ఇష్టారాజ్యంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ఎస్సై హెచ్చరించారు. ముఖ్యంగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల ముందు వాహనాలను రోడ్డుపై నిలిపివేయడం వల్ల ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. హైవేపై ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. హైవేపై వాహనాలను నిలిపి ట్రాఫిక్‌కు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు అని ఎస్ ఐ నరేష్ హెచ్చరించారు.



## ఘనంగా ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ బర్త్‌డే వేడుకలు

**శాలువాతో సన్మానించిన ప్రజాప్రతినిధులు**

ఝరాసంగం ఆగస్టు 27 (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండల సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ క్రాంతి కుమార్ పాటిల్‌కు నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. క్రాంతి కుమార్ పాటిల్ మంచి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాబోయే రోజుల్లో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డప్పూర్ సంగమేష్, నర్సింలు పటేల్, కొల్లూరు సర్పంచ్ చింతలగట్టు శివరాజ్, వనంపల్లి సర్పంచ్ నవీన్ పటేల్, నాయకులు రాయకోటి నర్సింలు, చిన్న సాల్మన్ తదితరులు పాల్గొన్నారు.



## కమల్‌పల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం

ఝరాసంగం, ఆగస్టు27(వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం కమల్‌పల్లి గ్రామంలో ఉజ్వలా బాయి--పండరి రావు దంపతుల నూతన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం గురువారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సీనియర్ కాంగ్రెస్ నాయకులు హన్మంత్ రావు పాటిల్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై రిబ్బన్ కట్ చేసి నూతన గృహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అనంతరం సంగ్రామ్ పటేల్, మారుతిరావు పటేల్ మాట్లాడుతూ గృహప్రవేశ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు డప్పూర్ సంగమేష్, నర్సింలు పటేల్, బస్వరాజ్ పటేల్, పెంటయ్య, షకీల్, నందప్ప, రామిరెడ్డి పటేల్, అశోక్, సంగన్న పటేల్, మాణిక్ రెడ్డి, మల్లప్ప పటేల్, నావాజ్ రెడ్డి, మోహన్, సంగమేశ్వర్, నాగిరెడ్డి, కుమార్, సురేష్, అంబేద్కర్, రాయికోటి నర్సింలు, బాలయ్య, రాములు, సంజీవ్, రాజులతో పాటు వివిధ గ్రామాల సర్పంచులు చింతల్‌గట్టు శివరాజ్, సుభాష్, రవి, వినోద్ రెడ్డి, అమృత్, నగేష్, నవీన్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లయ్య ఖబర్దార్!

## ఉత్తమ్-పద్మావతి రెడ్డిపై చేసిన ఆరోపణల ఖండన



కోదాడ, ఆగస్టు 27: కోదాడ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులపై మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేసిన విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కోదాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు , మాజీ సర్పంచ్ ఎర్నేని వెంకటరత్నం బాబు, చింతలపాటి శ్రీనివాసరావు, నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు.

కోదాడ ప్రాంతంలో సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రజలకు కళ్లముందే కనిపిస్తోందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాడుతూ, నిధులు మంజూరు చేయించి పనులు ముందుకు తీసుకెళ్లడంలో ఉత్తమ్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. రైతుల సమస్యలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవడం ఉత్తమ్, పద్మావతి దంపతులకు తెలుసన్నారు. బొల్లం మల్లయ్య యాదవ్ అధికారంలో ఉన్న సమయంలో రైతులకు ఏం న్యాయం చేశారో ప్రజలకు వివరించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల సాగునీటి అవసరాలు, పంటలకు గిట్టుబాటు ధర, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ఆయన హయాంలో చేసిన కృషిపై బహిరంగంగా చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అధికారం కోల్పోయిన అక్కసుతో ప్రజల కోసం నిజాయితీగా పనిచేస్తున్న ఉత్తమ్, పద్మావతి దంపతులపై నిరాధార విమర్శలు చేయడం సరికాదన్నారు.

కోదాడ అభివృద్ధిపై మాట్లాడే ముందు గత పాలనలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధిని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. వ్యక్తిగత విమర్శలకు దిగితే కాంగ్రెస్ శ్రేణులు తగిన రీతిలో సమాధానం చెబుతాయని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడితే స్వాగతిస్తామని, కానీ వ్యక్తిగత విమర్శలు, అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

రైతుల సంక్షేమం, సాగునీటి సౌకర్యాల విస్తరణ, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ఉత్తమ్, పద్మావతి దంపతుల లక్ష్యమని నాయకులు తెలిపారు. కోదాడ ప్రజలు అభివృద్ధిని కోరుకుంటున్నారని, రాజకీయ విమర్శల కంటే ప్రజలకు ఉపయోగపడే పనులపై దృష్టి పెట్టాలని బొల్లం మల్లయ్య యాదవ్‌కు సూచించారు. రామినేని శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వంటి పులి వెంకటేష్ ,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీర్ భాయ్ ,చింతలపాటి శ్రీనివాసరావు, బడేటి వెంకటేశ్వర్లు, మొక్క బిక్షపతి, కాసాని శివ, పిల్లుట్ల శ్రీనివాస్ బాల్ రెడ్డి , గంధం యాదగిరి, కంపాటి శ్రీనివాస్ , పాశం శ్రీనివాస్ ,మోడెం సైదిబాబు , బాయ్ జాన్, తదితరులు పాల్గొన్నారు.



## ఫీజుల బకాయి బీజేపీ లడాయి.. సీఎం దిష్టిబొమ్మ దహనం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే)ఆగస్టు 27: పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్మల్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షులు నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి. లేకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, కౌన్సిలర్లు వోడిసెల అర్జున్, సూరజ్ నాయక్, బీజేవైఎం నాయకులు వెంకటేష్, హరీష్, జుట్టు దినేష్, భారత్, విజయ్, సృజన్, బంటి, చరణ్, దీక్షిత్, అనిల్, శ్రీకాంత్, మధు, ప్రణయ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ఏ ఒక్కరి ఓటు పోవద్దు ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఎస్ ఐ ఆర్

**తెలంగాణ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తహర్ బిన్ హందాన్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 27 : అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఎస్ఐఆర్ నిర్మల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ తాహెర్ బీన్ ఆమ్దాన్ అన్నారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా సోన్ మండలం కడ్తాల్ గ్రామం, సిద్ధల కుంట, లక్ష్మణ చందా మండలం బాబాపూర్, మామడ మండలం కొరటికల్, దిమ్మదుర్తి, దిలావర్పూర్ మండలం కంజర్ మరియు మాడెగాం, నర్సాపూర్ మండలం మరియు నర్సాపూర్ గ్రామాలలో గురువారం నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ లో భాగంగా విడుదలైన ముసాయిదా ఓటరు జాబితాలో ఎవరి పేర్లలోనైనా తప్పులు ఉన్నా, ఇతర సమస్యలు ఉన్నా సంబంధిత ఆధారాలతో అధికారులను సంప్రదించి సరిచేసుకోవచ్చన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండే యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలో అర్హత ఉన్న ఏ ఒక్క ఓటరు పేరు కూడా జాబితా నుంచి మిస్ కాకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రజలకు అందుబాటులో ఉండి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుర్రం రాము, నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమా భీంరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు గాజుల రవికుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, శ్రీ గండి రామన్న దత్త సాయి ఆలయ చైర్మన్ కొట్టే శేఖర్, కాంగ్రెస్ పార్టీ వివిధ మండల అధ్యక్షులు మోహినొద్దీన్, కోంద్రు నరేష్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, మోతిలాల్, డిసిసి కార్యదర్శి మహమ్మద్ జీషాన్ అలీ మరియు గ్రామ కార్యదర్శులు, ఆర్ఐ లు , జీపీఓ , బీఎల్ఓలు , వార్డు సభ్యులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం ఆర్థిక భరోసా

**- ఆర్థిక భారం తగ్గించేలా!**

**- ఉచిత షూల పంపిణీ**

**- వార్డు కౌన్సిలర్ చింతల రాజు**



సుల్తానాబాద్ పెద్దపల్లి జిల్లా ఆగస్టు-27 వాయిస్ టుడే: విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు ఎదురుకాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోందని సుల్తానాబాద్ మున్సిపాలిటీ ఎనిమిదవ వార్డు కౌన్సిలర్ చింతల రాజు అన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలు, సౌకర్యాలు వారికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.గురువారం సుల్తానాబాద్ పట్టణంలోని అశోక్ నగర్ ఎనిమిద వ వార్డు ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందించిన షూలను కౌన్సిలర్ చింతల రాజు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ చింతల రాజు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిస్తూ, వారి చదువుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువుకు దూరం కాకూడన్న ఉద్దేశంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు.విద్యార్థులకు ఉచితంగా షూలను అందించడం ద్వారా పాఠశాలకు వచ్చే ప్రతి విద్యార్థికి అవసరమైన సౌకర్యం కల్పించడంతో పాటు, వారి కుటుంబాలపై కొంత ఆర్థిక భారం తగ్గుతుందని చింతల రాజు అన్నారు. చిన్నచిన్న అవసరాల కోసం తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సాంకేతిక, సామాజిక రంగాల్లోనూ ప్రతిభను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత విద్యను అభ్యసించి, భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదిగి తల్లి దండ్రులకు, పాఠశాలకు, సమాజానికి మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులకు సూచించారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేయడం పట్ల చింతల రాజు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి తమ జీవితాల్లో స్థిరపడేందుకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం ఎంతో విలువైనదని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**